క్లుప్తంగా

చౌక ఔషధాలు అందుబాటులో ఉంచాలి

కర్నూలు(సెంట్రల్): మెడికల్ షాపుల్లో అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు మెడికల్ మాఫియా రెచ్చిపోతోందన్నారు. మెడికల్ ఏజెన్సీలు, మెడికల్ షాపుల నిర్వాహకులు కలిసి తక్కువ రేటుకు లభించే మందులను అందుబాటులో ఉంచడం లేదన్నారు. ఎక్కువ కమీషన్ ఇచ్చే కంపెనీల మందులనే విక్రయానికి ఉంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు బీసన్న, హుస్సేన్ భాష,చంటి, చిన్న, చరణ్ పాల్గొంటారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే

కర్నూలు(రాజ్‌విహార్):పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్థానిక బేకార్ కట్ట సిలార్‌సా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం ఆయన మసీదు పెద్దలతో కలిసి సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు.

పనిచేయని కీబోర్డులతో పరీక్ష

కర్నూలు(సిటీ): హైకోర్టు ఆధ్వర్యంలో పరీక్ష పాసైన టైపిస్టు, కాపీయిస్టు అభ్యర్థులకు శుక్రవారం టైపింగ్ స్క్రీనింగ్ టెస్టును నందికొట్కూరు రోడ్డులోని అయాన్ డిజిటల్ కాలేజీలో నిర్వహించారు. కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన దాదాపు వంద మంది పరీక్షకు హాజరు కాగా కంప్యూటర్ల కీబోర్డులు సరిగా పనిచేయకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. కీబోర్డులు సరిగా పనిచేయడం లేదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా ఆయన రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఉన్న వాటితోనే అభ్యర్థులకు పరీక్ష నిర్వహించడంతో వారు చేసేదేమీ లేక పరీక్షను పూర్తి చేశారు. అయాన్ డిజిటల్ కాలేజ్ నిర్లక్ష్యంపై రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామని పలువురు అభ్యర్థులు తెలిపారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన



మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మైనర్లను కర్నూలు జువైనల్ కోర్టులో హాజరుపర్చగా వారితో పాటు మోటార్ సైకిల్ యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ట్రాఫిక్‌స్టేషన్ వద్ద ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. గతంలో మైనర్లు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలను వీడియోల రూపంలో ప్రొజెక్టర్‌పై ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు.

శ్రీరామకోటి యజ్ఞం పుస్తకావిష్కరణ



రామకోటి యజ్ఞం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్: అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పురష్కరించుకొని అవోపా ఆధ్వర్యంలో 108 కోట్ల శ్రీరామ నామ లిఖిత యజ్ఞం పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం గాయత్రి గోశాలలో జరిగింది. అవోపా, వీహెచ్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో సంకల్పించిన 108 కోట్ల రామ కోటి యజ్ఞం పుస్తకాలను యువ పారిశ్రామికవేత్త టీజీ భరత్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి తదితరులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భక్తులు రాసిన రామకోటి పుస్తకాలు అయోధ్య శ్రీరామచంద్రమూర్తి సన్నిధికి చేరతాయన్నారు. అవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, అధ్యక్షులు యుంగంధర్ శెట్టి, బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, శాకుంతలం , రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్-1, దసరా, రుద్రుడు, శాకుంతలం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విరుపాక్షి, విడుదల పార్ట్-1, రుద్రుడు
ఐనాక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, సుజుమె, విడుదల పార్ట్-1, ది సూపర్ మారియో బ్రదర్స్, హలో మీరా, రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, బలగం, దసరా
శ్రీరామ : విరుపాక్షి, **రాజ్** : విరుపాక్షి
విజయ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్

సాఫ్ట్‌బాల్‌లో మెరిక

- అద్భుత ప్రతిభతో రాణిస్తున్న గ్రామీణ క్రీడాకారిణి అఖల
- జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన వైనం
- హాంకాంగ్‌లో నిర్వహించే పోటీలకు ఎంపిక
- శిక్షణలో పాల్గొనాలంటూ అమెచ్యూర్ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ నుంచి ఆహ్వానం
- సహకరించని ఆర్థిక పరిస్థితి
- దాతల సాయం కోసం ఎదురుచూపు

కర్నూలు (టౌన్): సాఫ్ట్‌బాల్ క్రీడలో అత్యుత్తమంగా రాణిస్తూ జిల్లా క్రీడాకారిణి శభాష్ అనిపించుకుంటోంది. కర్నూలు నగరంలోని కేవీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతూ సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారిణి అఖిల. ఈ నెలాఖరు నుంచి మే 2వ తేదీ వరకు హాంకాంగ్‌లో నిర్వహించనున్న ఆసియా మహిళల సాఫ్ట్‌బాల్ కప్ పోటీలకు ఎంపికయ్యింది. జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటిన అఖిలకు ఏకంగా ఆసియా కప్ ప్రాబబుల్స్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. కర్నూలులో సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న ఈమె హాంకాంగ్ దేశంలో జరిగే పోటీలకు ఎంపిక కావడంపై పలువురు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే చిన్నప్పటి నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఈమె పోటీలకు వెళ్లేందుకు సాయం కోసం దాతల వైపు ఆశగా ఎదురుచూస్తోంది. దాతలు సహకరిస్తే దేశం తరపున సత్తా చాటుతానంటోంది.

అఖిల కుటుంబ నేపథ్యం

కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోని మారుమూల గ్రామం డి.కోటకొండలో అఖిల ప్రాథమిక విద్య పూర్తి చేసుకుంది. గొనెగండ్ల మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ అనంతరం కర్నూలు నగరంలోని కేవీఆర్ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ బీఏ రెండవ సంవత్సరం చదువుతోంది. వీరిది వ్యవసాయ కుటుంబం. తండ్రి నాగేష్, తల్లి నరసమ్మ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పేద రైతు కుటుంబంలో పుట్టినప్పటికీ సాఫ్ట్‌బాల్‌పై మక్కువతో క్రీడలో నైపుణ్యం సాధించిన అఖిల స్కూల్‌గేమ్స్, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి అనేక బహుమతులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు వ్యక్తిగత ఖాతాలో వేసుకుంది. ఇప్పటికే పంజాబ్ యూనివర్సిటీలో నిర్వహించనున్న శిక్షణలో పాల్గొనాలని అమెచ్యూర్ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి క్రీడాకారిణికి ఒక లేఖ వచ్చింది. అవకాశం వచ్చినా ఆర్థిక ఇబ్బందులతో ముందుకు వెళ్లలేని దయనీయ పరిస్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది.

అఖిల సాధించిన విజయాల్లో కొన్ని..

- 2016 మే 2న నాగపూర్ యూనివర్సిటీ మైదానంలో నిర్వహించిన 4వ మినీ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది.
- 2017 జూన్‌లో తెలంగాణ రాష్ట్రంలోని దోమలగూడలో ఉన్న గగన్‌మహల్‌లో నిర్వహించిన 30వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచింది.
- 2017 డిసెంబర్ 27న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో నిర్వహించిన మినీ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచింది.



సాఫ్ట్‌బాల్ పోటీలో షాట్ కొడుతున్న అఖిల

ఆర్థిక ఇబ్బందులతో సతమతం



జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అనేక పోటీల్లో పాల్గొన్నాను. మన దేశం తరపున హాంకాంగ్‌లో నిర్వహించనున్న ఆసియా మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాను. ఇప్పటికే అమెచ్యూర్ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి లెటర్ వచ్చింది. ప్రత్యేక శిక్షణ కోసం పంజాబ్ యూనివర్సిటీకి వెళ్లాల్సి ఉంది. అయితే ఆర్థిక ఇబ్బందులతో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. సహకారం అందిస్తే దేశానికి పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది.

– అఖిల, సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి

నేడు ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు: రంజాన్ పండుగను పురస్కరించుకుని నగరంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని డీఎస్పీ నాగభూషణం శుక్రవారం చేసిన ప్రకటనలో తెలిపారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల సుందరయ్య సర్కిల్ నుంచి వెళ్లే వాహనాలు వెంకటరమణ కాలనీ మీదుగా మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. బంగారుపేట రహదారి మూసివేసి వాహనాలను ఐదు రోడ్ల కూడలి నుంచి ఆర్ఎస్ రోడ్డు వైపు మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. గౌరీగోపాల్ హాస్పిటల్‌కు ఎదురుగా కిసాన్ ఘాట్ రూట్ నుంచి ఆనంద్ థియేటర్ వైపు వెళ్లే రూట్‌ను కూడా మూసేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తబస్టాండ్ నుంచి నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను బళ్లారి చౌరస్తా, కృష్ణానగర్, గుత్తి పెట్రోల్ బంకు, బిర్లా జంక్షన్, మద్దూర్ నగర్, అమ్మా హాస్పిటల్, నంద్యాల చెక్ పోస్టు మీదుగా వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే డోన్ వైపు వెళ్లే వాహనాలన్నీ బళ్లారి చౌరస్తా, సస్యా హోండా షోరూమ్ నుంచి కృష్ణానగర్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. అలంపూర్, గద్వాల, ఐజ, హైదరాబాదు వైపు వెళ్లే బస్సులు బళ్లారి చౌరస్తా, సంతోష్‌నగర్ హైవే మీదుగా వెళ్లాలని డీఎస్పీ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కృష్ణానగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 27వ వార్డు 68వ సచివాలయం పరిధిలోని కృష్ణానగర్‌లో స్థానిక కార్పొరేటర్ పి.శారద ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కాలనీ వాసులు ఆత్మీయ స్వాగతం పలికారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కాలనీలో ఎమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలన్నారు. సంక్షేమ పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో అందిస్తున్నారా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చారని, సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కాలనీ వాసులు కుళాయిల్లో కలుషిత నీరు వస్తోందని చెప్పగా సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ కాలువలు, రోడ్లు నిర్మించాలని కోరగా నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అరుణ, చిట్టెమ్మ, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శివ, సత్యం యాదవ్, సబిహా సుల్తానా, సుబ్రహ్మణ్యం, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను సంరక్షించుకోవాలి



పోటీల్లో గెలుపొందిన విజేతలతో అతిథులు

కర్నూలు కల్చరల్: సహజ వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో భారత ప్రభుత్వ పృథ్వీ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన జీవరాశికి అవసరమైన సహజ సిద్ధ వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం మనపై ఉందన్నారు. కర్నూలు నగరపాలక సంస్థ ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వన సంరక్షణకు కృషి చేయాలన్నారు. నైస్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, అటవీశాఖ అధికారి రాజేంద్ర మాట్లాడారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు అటవీశాఖ విశ్రాంత అధికారి జయచంద్రారెడ్డి, స్పెషల్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబుబ్ బాషా, లక్ష్మీ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు రాయపాటి నానగలక్ష్మి, సభ్యులు గోవర్ధనగిరి, మంజునాథరెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచభూతాలతోనే మానవ మనుగడ



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ సునీత తదితరులు

కర్నూలు(హాస్పిటల్): సృష్టిలో పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతోందని శ్రీహరి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సునీత అన్నారు. యువజన సర్వీసుల శాఖ-సెట్కూరు ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలులోని శ్రీహరి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.సునీత మాట్లాడుతూ భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు అనే పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రస్తుతం పంచభూతాలన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని, అభివృద్ధి పేరుతో జరిగే విపరీత చర్యలు భూమాతను నిలువునా దహించి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ వినాశకర చర్యలకు దూరంగా ఉండాలని చెప్పారు. చెట్లను వీలైనంత ఎక్కువగా నాటాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సెట్కూరు మేనేజర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ పెరిగిపోతున్న భూతాపం, వాతావరణ కాలుష్యంతో సతమతమవుతున్న భూమాతను కాపాడుకోవడానికి, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫస్ట్‌స్టెప్ సొసైటీ చైర్మన్ ఎస్.రాజశేఖర్, సెట్కూరు సూపరింటెండెంట్ రాజేశ్వరి, కళాశాల అధ్యాపకులు వై.దీప్తి, కార్తీక్‌కుమార్, మంజునాథ్ పాల్గొన్నారు.

వాల్మీకులపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించడంపై మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ వాల్మీకులను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, చంద్రబాబు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సత్యపాల్ కమిటీ వేశారని, తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పడాన్ని తప్పుబట్టారు. లోకేష్ గాలి మాటలను నమ్మే పరిస్థితిలో వాల్మీకులెవరూ లేరన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఆనాడు తన పార్టీ ఎంపీలతో వాల్మీకుల అంశంపై పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే వాల్మీకులకు న్యాయం జరుగుతుందని, రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్‌తో ఏకసభ్య కమిషన్ వేయించి సమగ్ర నివేదికతో అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు పలుమార్లు వాల్మీకుల అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడారని వివరించారు. ఎస్టీ రిజర్వేషన్ సాధించే వరకు ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే మే 31వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాల్మీకుల సంకల్ప దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వాల్మీకులు స్వచ్ఛందంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. వీఆర్‌పీఎస్ నేతలు శ్రీనివాసులు, దూపాడు మల్లేష్, ఎం.శివ, మహేష్, రాజశేఖర్, మధు, గాలన్న, శేఖర్, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి నాటక పోటీలు



మాట్లాడుతున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: పీఎంకేఎం, వైఎస్సార్ కళాపరిషత్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో మే 17, 18, 19 తేదీల్లో కర్నూలులో జాతీయ స్థాయి నాటక పోటీలను నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. శుక్రవారం సీక్యాంప్‌లో కళాక్షేత్రంలో ఆయన మాట్లాడుతూ పీఎంకేఎం వ్యవస్థాపక అధ్యక్షుడు పసుపులేటి వెంకటరమణ సారథ్యంలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నాటకానికి రూ.లక్ష నగదు, ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు. 17వ తేదీ విజయవాడ మైత్రీ కథా నిలయం వారి 'ఇతిహాసం', రేపల్లె గురుమిత్ర కళా సమితి వారి 'కొండ' నాటికలు, 18న విజయవాడ హర్షక్రియేషన్స్ వారి 'స్వర్ణ కమలాలు', గుంటూరు అమృత లహరి థియేటర్‌వారి 'నాన్న నే వచ్చేస్తా', హైదరాబాద్ కళా శోభ క్రియేషన్స్ వారి 'ఒక్క క్షణం', నాటికలు, 19న విశాఖ కళాభినయ వారి 'ఓ కాశీ వాసీ రాబయ్య', వీరన్న పాలెం కళానికేతన్ వారి 'స్థిరాస్తి', ఒంగోలు గొల్లపల్లి ఆర్ట్స్ వారి 'కనిపించే దైవం' నాటికలను స్క్రూటినీ చేసి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కళాక్షేత్రం సభ్యులు ఇనాయతుల్లా, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పనిచేయనున్న పన్ను కౌంటర్లు

కర్నూలు (టౌన్): రంజాన్ పండుగ పురస్కరించుకొని శనివారం నగరపాలక కార్యాలయానికి సెలవు ఉన్నా.. పన్ను కౌంటర్లు పనిచేస్తాయని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లింపుదారులకు 5 శాతం డిస్కౌంట్ అవకాశం కల్పించిందని వెల్లడించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కర్నూలు(రాజ్‌విహార్): అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన కిందిస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలుల కారణంగా బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ జరిగితే వెంటనే స్పందించి సరఫరా పునరుద్ధరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం పనికిరాదని సూచించారు.

బదిలీ న్యాయమూర్తులకు ఘన సన్మానం



న్యాయమూర్తులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(లీగల్): జిల్లాలో మూడేళ్లకుపైగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ముగ్గురు న్యాయమూర్తులను శుక్రవారం కర్నూలు న్యాయవాదులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన టి.కేశవ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన డి.షర్మిల, ఎక్సైజ్ కోర్టు జడ్జిగా పనిచేసిన కె.భార్గవిలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి షఫత్, గ్రంథాలయ కార్యదర్శి రవికుమార్, మహిళా ప్రతినిధి సి.జాస్మిన్‌లు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఏజీఎం సురేష్

కర్నూలు (టౌన్): ఈనెల 17వ తేదీ జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్ అభినందించారు. స్థానిక వెంకటరమణ కాలనీలోని పాఠశాల ప్రాంగణంలో బెల్టులు సాధించిన భార్గవ్, వరప్రసాద్, రియాజ్, రోహిత్, హర్షిత్‌లను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం తైక్వాండో వంటి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ప్రిన్సిపాల్ మంజుల పాల్గొన్నారు.

కార్మికుడి దుర్మరణం

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న గ్రీన్‌కో సోలార్ ప్రాజెక్టు పనుల్లో భాగంగా ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యం శుక్రవారం తెలిపారు. వివరాలు.. కాకినాడకు చెందిన గడ్డం మణికంఠ (27) గ్రీన్‌కో పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నారు. కొలతలు వేస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు జారి గుంతలో పడినట్లు చెప్పారు. గుర్తించిన తోటి కార్మకులు బయటకు తీసి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తమ్ముడు గడ్డం సత్యప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం



రైలు పట్టాలపై పడిఉన్న మృతదేహం

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలో రోజా వీధి సమీపంలో రైలు పట్టాలపై మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఉదయం 242/1-2 కిలోమీటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారమివ్వడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు మహిళ రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఉండొచ్చని భావిస్తున్నారు. సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉండి 5.3 అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఉంది. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రీన్ కలర్ పంజాబీ డ్రస్సు, ఆకుపచ్చ రంగు లోయర్, పింక్ కలర్ ఐపీఎల్ నైట్ రైడర్స్ టీషర్టు, తలకు బ్లూ స్కార్ఫ్ ధరించింది. మృతురాలి ఆచూకీ తెలిసినవారు 94417 59875కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏఎస్ఐ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.